స్వదేశీ మేళాలో ఏర్పాటు చేసిన కరీంనగర్ డెయిరీలో ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఉద్యోగ మహోత్సవ్‌కు స్పందన

- భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువతీ, యువకులు
- నేడు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్

విద్యానగర్, ఫిబ్రవరి 11: స్వదేశీ మేళాలో భాగంగా ఏర్పాటుచేసిన ఉద్యోగ మహోత్సవ్ కార్యక్రమం మంగళవారం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ప్రారంభమైంది. స్టేడియంలో 110 కంపెనీలు, వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన ఉద్యోగ స్టాల్స్‌ను స్వదేశీ జాగరణ మంచ్ కన్వీనర్ ముక్క హరీశ్ బాబు ప్రారంభించారు. దాదాపు 6 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులు జాబ్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ముక్క హరీశ్ బాబు మాట్లాడుతూ, ఆరు రోజుల పాటు జరిగే ఈ స్వదేశీ మేళాలో దాదాపు 2 లక్షల మంది పాల్గొనేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా దేశీయ ఉత్పత్తులను సంబంధించి ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారని, 210కి పైగా స్టాల్స్ బుధవారం నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. దాదాపు 1000 మందికి ఉద్యోగ కల్పన లక్ష్యంగా ఉద్యోగ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వదేశీ మేళా కో కన్వీనర్ కళ్లెం వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, స్వదేశీ మేళాలో భాగంగా బుధవారం ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ముఖ్యఅతిథిగా పీటీసీ సూపరింటెండెంట్ శ్రీనివాస సుంకర, మాజీ డీఆర్డీవో డైరెక్టర్ డాక్టర్ సతీశ్ రెడ్డి, విజయానంద్, ఇంద్రసేనారెడ్డి లాంటి ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 9.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వదేశీ మేళా బాధ్యులు మాధవరావు, గంప వెంకట్, ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, రఘురామ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు హాజరైన యువకులు

పరిషత్తు ఎన్నికలకు 943 పీఎస్‌లు

శిక్షణ శిబిరంలో పాల్గొన్న జడ్పీ సీఈవో, మైనార్టీ వెల్ఫేర్ అధికారి, తదితరులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : జిల్లా, మండల పరిషత్తు ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆర్వోలు, ఏఆర్వోలను నియమించి, వారికి మొదటి విడుత శిక్షణ కూడా పూర్తి చేయగా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తిచేసి, వాటి జాబితాను అధికారులు మంగళవారం విడుదల చేశారు. నేడు, రేపు వీటిపై అభ్యంతరాలు స్వీకరించి, అవసరమైతే మార్పులు చేర్పులు కూడా చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో మొత్తం 5,87,285 మంది జనాభా ఉండగా, వీరిలో 5,08,489 మంది ఓటర్లున్నట్లు ప్రకటించారు. ఇందులో 2,60,825 మంది స్త్రీలు, 2,47,652 మంది పురుషులు ఉన్నారు. 170 ఎంపీటీసీ, 15 జడ్పీటీసీ స్థానాలు ఉండగా ప్రాదేశిక ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు 943 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. జిల్లాలో 318 గ్రామాల్లో 2,962 వార్డులు ఉండగా, పంచాయతీ ఎన్నికల కోసం ప్రతి వార్డుకు ఒక పోలింగ్ బూత్ చొప్పున జిల్లా వ్యాప్తంగా 2,962 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఆర్వోలు, ఏఆర్వోలకు ముగిసిన శిక్షణ

పరిషత్ ఎన్నికలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు మంగళవారం జడ్పీ సమావేశమందిరంలో నోడల్ అధికారి జడ్పీ సీఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 170 ఎంపీటీసీ స్థానాలకు ఆర్వోలు, ఏఆర్వోలు కలిపి 126 మంది, 15 జడ్పీటీసీ స్థానాలకు 15మంది ఆర్వోలను ఎంపిక చేశారు. ఎంపీటీసీ ఆర్వోలుగా పలు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, జడ్పీటీసీ ఆర్వోలుగా డివిజన్ స్థాయి అధికారులను నియమించి శిక్షణ అందించారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బి.పవన్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు పీవోలు, ఏపీవోలకు శిక్షణ

శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు బుధవారం శిక్షణ ఇవ్వనున్నారు. జడ్పీ సమావేశమందిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని 85 పట్టభద్రుల, 18 ఉపాధ్యాయ శాసనమండలి పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న 492 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న జడ్పీ సీఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

చొప్పదండి, ఫిబ్రవరి 11: రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియస్ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చొప్పదండి మండల రెడ్డి జేఏసీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అనుషకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మాట్లాడుతూ, రాజ్యాంగ బద్ధంగా ఎమ్మెల్సీగా ఎన్నికై, రాగద్వేషాలకు అతీతంగా నడుచుకుంటానని ప్రమాణం చేసిన తీన్మార్ మల్లన్న కొంత కాలంగా రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరుస్తూ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ లబ్ధికోసం రెడ్డి సామాజిక వర్గంపై ఇస్టానుసారంగా మాట్లాడినందుకు చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

'నాణ్యమైన విద్యకు ఎస్ఆర్ఆర్‌లో చేరండి'

గంగాధర, ఫిబ్రవరి 11 : నాణ్యమైన విద్య, ఉపాధి నైపుణ్యాల కోసం కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో చేరాలని అడ్మిషన్ల బాధ్యుడు, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మల్లారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని వివిధ జూనియర్ కళాశాల్లో కళాశాల తరపున ప్రచారం నిర్వహించారు. కళాశాల గోడప్రతిని ఆవిష్కరించి, అడ్మిషన్ల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కళాశాల అందజేస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చిలువేరి ప్రవీణ, స్వరూపారాణి, మృదుల, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ప్రమాదాలపై విచారణ జరుపాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ ప్రమాదాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉపాధి హామీ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రాజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆసంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కూలీలతో ప్రమాదకరమైన చోట్ల పనులు చేయిస్తున్న ఉపాధి సిబ్బంది, కూలీల ఆయుష్షు తీస్తున్నారని ఆరోపించారు. ఇందుకు నిదర్శనంగా ఉమ్మడి జిల్లాలోని గోవర్ధనగిరి గ్రామంలో ఇటీవల జరిగిన ఘటనను గుర్తు చేశారు. బాధిత కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం అందించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, వీరసోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువలో పడి ఒకరి మృతి.. మరొకరి గల్లంతు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 11: మండలంలోని పోతిరెడ్డి పేట గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు కాకతీయ కాలువ డీబీఎం15లో పడి ఒకరు మృతి చెందగా, మరొక వ్యక్తి గల్లంతయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన రేణిగుంట్ల సురేశ్, జూపాక శ్రీహరి ఇద్దరు వ్యక్తులు కాలువలోకి స్నానం చేయడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయారు. నీళ్లలో కొట్టుకుపోతుండగా స్థానికులు గమనించి, సురేశ్(35)ను ఒడ్డుకు చేర్చగా అప్పటికే మృతి చెందాడు. గల్లంతైన శ్రీహరి కోసం గాలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. శ్రీహరికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల గౌడ్ తెలిపారు.

జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సత్కారం

కొత్తపల్లి, ఫిబ్రవరి 11: కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో ఈనెల 13 నుంచి 16 వరకు జరిగే 49వ జాతీయస్థాయి సీనియర్స్ యోగాసనా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి 14 మంది క్రీడాకారులు ఎంపిక కాగా, వారిని మంగళవారం నగరంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో తెలంగాణ యోగా సంఘం చైర్మన్ సర్దార్ రవిందర్‌సింగ్ సత్కరించారు. జాతీయస్థాయి యోగా పోటీలో అద్భుత ప్రదర్శన చూపి అంతర్జాతీయ యోగా పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, బాధ్యులు, కోచ్‌లు కిష్టయ్య, రామకృష్ణ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని పోరండ్ల సహకార పరపతి సంఘం వార్షిక మహాసభను మంగళవారం నిర్వహించారు. త్వరలో సొసైటీ పాలకవర్గం పదవీ కాలం ముగియనున్న సందర్భంగా చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డితో పాటు డైరెక్టర్స్‌ను మన్నెంపల్లి మాజీ సర్పంచ్ గడ్డం శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, సుదగోని శ్రీనివాస్ గౌడ్, కొయ్యేడ తిరుపతి గౌడ్, జాప రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని జూబ్లినగర్, నగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు మంగళవారం అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి రవీందర్ ప్రారంభించారు. పట్టుదలతో చదివి, ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వదేశీమేళా క్రీడా పోటీల్లో మానేరు విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, ఫిబ్రవరి 11 : కరీంనగర్‌లోని అంబేద్కర్‌స్టేడియంలో స్వదేశీ మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. బాలికల ఖోఖో పోటీల్లో మానేరు సీబీఎస్ఈ పాఠశాల ప్రథమ, బాలుర ఖోఖో పోటీల్లో సాయి మానేరు పాఠశాల ప్రథమ, మానేరు సీబీఎస్ఈ పాఠశాల ద్వితీయ బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపల్స్ రాజు చాకో, సరితా రెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, తిరుపతి, స్వామి, జహేద, శిరీషతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

'యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందొద్దు'

జమ్మికుంట, ఫిబ్రవరి 11: యూరియా కొరత లేదని, అన్నదాతలు యూరియా అందుబాటులో లేదనే అపోహలు నమ్మొద్దని మండల వ్యవసాయాధికారి ఖాదర్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ.. సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, డీసీఎమ్మెస్‌లలో 60 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, మండలానికి సరిపడా యూరియాను జిల్లా నుంచి కేటాయించారని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ షాపుల్లో 180 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని చెప్పారు. రైతులకు అవసరానికి అనుగుణంగా యూరియా సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

పట్టుపరిశ్రమపై విద్యార్థుల క్షేత్రపర్యటన

రామడుగు, ఫిబ్రవరి 11 : గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సెరికల్చర్‌పై అవగాహన కల్పించేందుకు మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబటి వేణుకుమార్ క్షేత్రపర్యటన నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక ఆదర్శ రైతు ఎడవెల్లి కిషన్‌రెడ్డి చేపట్టిన పట్టుపురుగుల పెంపకం, మల్బరీ తోటలను సందర్శించారు. పట్టుపురుగుల లార్వా కొనుగోలు మొదలు వాటి పెంపకంతో పాటు చేతికొచ్చిన పంటను ఎక్కడ విక్రయించాలన్న విషయాలను రైతు కిషన్‌రెడ్డి విపులంగా వివరించారు. ఇక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న తూడి లచ్చయ్య

గంగాధర, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని పురాతన వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం నాయకుడు తూడి లచ్చయ్య రూ.20,116 విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. విరాళం అందజేసిన లచ్చయ్యకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచ్ మడ్లపెల్లి గంగాధర్, నాయకులు న్యాలకొండ ప్రవీర్‌రావు, దేశెట్టి నర్సయ్య, మడ్లపెల్లి శ్రీనివాస్, సామంతుల శ్రీనివాస్, జారతి సత్తయ్య, దొడ్ల ఎల్లారెడ్డి, జారతి రాజిరెడ్డి, పొన్నం తిరుపతి, వేముల రాములు, పెంచాల మల్లేశం, కట్ల వెంకటేశం, మడ్లపెల్లి రమణ తదితరులు ఉన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు

బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో డీఈవో జనార్దన్ రావు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 11 : ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా ప్రతి మండలంలో జరిగిన మండల స్థాయి 'ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్'లో ప్రతిభ చూపిన ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి, జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ టెస్ట్ ద్వారా విద్యార్థుల సైన్స్ విషయ పరిజ్ఞానం, విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రావు రాపిడ్ ఫైర్ రౌండులో ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు చకచకా సమాధానాలు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీఈబీ ఎం స్వదేశ్ కుమార్, ఏఎంవో కే అశోక్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎం శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి పీ జైపాల్ రెడ్డి, జీసీడీవో డీ కృపారాణి, ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు అమిరిశెట్టి దామోదర్, జనరల్ సెక్రటరీ వడ్నాల రాంకిరణ్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఓదెలు కుమార్, లింగారెడ్డి, సురేంద్ర కుమార్, దేవదాస్, ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులకు హాజరుకావాలి

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 11: పదో తరగతికి నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు విద్యార్థులందరూ హాజరు కావాలని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు ఆదేశించారు. మంగళవారం మానకొండూర్ మండలం అన్నారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు టీ శాట్ ద్వారా నిర్వహిస్తున్న మోటివేషన్ ఆన్‌లైన్ తరగతులను పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత పొందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జయేంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు కూర శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, మురళీకృష్ణ, శ్రీవాణి, శైలజ, వీరన్న, మమత పాల్గొన్నారు.

వేసవి డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు

ముకరంపుర, ఫిబ్రవరి 11: వేసవిలో పెరుగనున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక మేరకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10న జిల్లాలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 731.78 మెగావాట్లుగా నమోదు అయిందని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో విద్యుత్ వినియోగం భారీగా పెరిగే అవకాశం ఉన్నందున ఆ మేరకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 178 కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయగా, 121 ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచినట్లు తెలిపారు. 6 పవర్ ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటుతో పాటు మరో 5 పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచామని, మిగులు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు కొత్తగా 39 ఇంటర్ లింక్ లైన్లు, కొత్త ఫీడర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

అద్దె చెల్లించేదే లేదు: డీసీఎంఎస్ దుకాణాదారుల తీర్మానం

హుజూరాబాద్, ఫిబ్రవరి 11: హుజూరాబాద్ డీసీఎంఎస్ దుకాణా సముదాయాలకు సంబంధించిన అద్దె చెల్లించేదే లేదని దుకాణాల యజమానులు కరాఖండిగా తేల్చి చెప్పారు. పట్టణంలోని డీసీఎంఎస్ మహాలక్ష్మి కళ్యాణ మండపంలో దుకాణాల యజమానులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యజమానులు మాట్లాడుతూ, డీసీఎంఎస్ సెంటర్లకు సంబంధించి కిరాయి ఇష్టానుసారంగా పెంచడంపై మండిపడ్డారు. లీజు అగ్రిమెంటుకు విరుద్ధంగా పద్ధతి తప్పి కిరాయి పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కిరాయి విషయంలో న్యాయం జరిగే వరకూ అద్దె ఎవరూ చెల్లించవద్దని తీర్మానం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ దుకాణాదారుల యజమానుల అధ్యక్షుడు వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు మురికి అనిల్ కుమార్, చంద్రమౌళి, సెక్రటరీ పాకాల రవీందర్ రెడ్డి, సభ్యులు మల్లారెడ్డి, రమేశ్ రెడ్డి, గంగిశెట్టి ప్రభాకర్, కొమురవెల్లి రఘువీర్, కొయ్యడ రమేశ్, శివ తదితరులు ఉన్నారు.

సోలార్ సర్వేకు రైతులు సహకరించాలి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: రేకొండ గ్రామంలో సోలార్ గృహ వినియోగదారుల సర్వే పూర్తయిందని, మంగళవారం నుంచి వ్యవసాయ కనెక్షన్స్ నమోదు చేసే కార్యక్రమం ప్రారంభించామని ట్రాన్స్‌కో ఏఈ ప్రకాశ్ తెలిపారు. గ్రామంలో 1300 కనెక్షన్లకు గానూ 1171 గృహ వినియోగదారుల సర్వే పూర్తి చేశామని చెప్పారు. మిగతావి పేరు మార్పిడికి దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. గ్రామంలో 874 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని, సర్వేలో రైతులు పూర్తిస్థాయిలో సహకరిస్తే వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రైతులు సంబంధిత డాక్యుమెంట్స్ ఆధార్ కార్డు, పాస్ బుక్, సర్వీస్ కనెక్షన్ నంబర్, రిజిస్టర్ మొబైల్ నంబర్, కిసాన్ క్రెడిట్ కార్డ్, పాన్ కార్డు వెంట తెచ్చుకొని గ్రామపంచాయతీలో విద్యుత్ సిబ్బందిని కలువాలని ఏఈ సూచించారు. సోలార్‌తో గ్రామస్తులకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు.

దొంగ బాబాకు దేహశుద్ధి

గ్రామస్తులు పట్టుకున్న మల్లేశ్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 11: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో హనుమాన్ మాలధారణలో వచ్చి జాతకం చెబుతానని ప్రజలను మోసం చేస్తున్నారన్న అనుమానంతో గ్రామస్తులు ఓ వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలం కొత్తూర్ గ్రామానికి చెందిన పస్తం మల్లేశ్, రెబెల్లి జాను అనే ఇద్దరు సోమవారం మన్నెంపల్లి గ్రామంలో జాతకాలు చెబుతామంటూ తిరిగారు. హనుమాన్ మాలధారణలో ఉన్న మల్లేశ్ పలువురికి సమస్యలు తీర్చుతానని తాయత్తులు ఇచ్చి కొంత నగదును ఫోన్ పే చేయించుకుని పరారయ్యాడు. తేరుకున్న బాధితులు మోసపోయామని గ్రహించి ఊరుకున్నారు. మళ్లీ మంగళవారం పస్తం మల్లేశ్ గ్రామం మీదుగా మల్లాపూర్ వైపు వెళ్తుండగా గుర్తించిన గ్రామస్తులు వెంబడించి పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. మల్లేశ్‌ను రాత్రి వరకు పోలీసులు అదుపులోనే ఉంచుకున్నారు.

చెట్టు పైనుంచి పడి రైతు మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11: రేకొండ గ్రామంలో చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి రైతు మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు.. చెంచల సంపత్ (38) రోజువారీలాగే వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పనులు చేస్తుండగా, సమీపంలోని వారు చింత చెట్టుకు కాయలు తెంపమని కోరగా చెట్టు ఎక్కాడు. చింతకాయ తెంపుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆటోలో కరీంనగర్ దవాఖానకు తరలిస్తుండగా గ్రామ శివారులోనే సంపత్ మృతి చెందాడు. ఈ ఘటనతో సంపత్ భార్య రజిత, ఇద్దరు కూతుర్లు శోకసంద్రంలో మునిగిపోయారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

'ఆరోగ్య మహిళ' సద్వినియోగం చేసుకోవాలి

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 11: ఇందిరానగర్‌లో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వంద మందికి 54 రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అలేఖ్య, నిహారిక, హెల్త్ సూపర్ వైజర్లు శ్రీనివాస్, వెంకటేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, లక్ష్మీరాజం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 11: పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మదనం గంగాధర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జీవితంలో ఎంతో కష్టపడి చదువుకొని ఎస్ఐగా ఉద్యోగం సాధించి, ప్రమోషన్‌పై డీఎస్పీ స్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. సమాజానికి మంచి చేయాలని డీఎస్పీ ఉద్యోగం నుంచి వీఆర్ఎస్ తీసుకొని రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఇంటర్నెట్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి

ఇంటర్నెట్ జాగ్రత్తలపై కరపత్రం విడుదల చేస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 11: ప్రపంచాన్ని ఇంటర్నెట్ కుగ్రామంగా మార్చిందని, అయితే ఇంటర్నెట్ వినియోగదారులు తగు జాగ్రత్తలు తీసుకొని దానిని వాడుకోవాలని ఎస్సారార్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి సూచించారు. కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ విభాగం సౌజన్యంతో కరీంనగర్ జిల్ల